తెలుగు కళా సమితి న్యూజెర్సీ–రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి కథల పోటీలో 500/– బహుమతి గెలుచుకున్న కథ



# ఆత్మశాంతి

–కోరుకొండ సత్యానంద్

రామారావు తండ్రి కన్ను మూసాడు.

గుండెల మీద పెంచి తప్పటడుగులు వేస్తుంటే చేయి పట్టుకుని నడిపించి, అల్లరి సహించి, మాటలకు మురిసిపోయి, చదివించి, పెద్దవాణ్ణి, ఇంతవాణ్ణి చేసిన తండ్రి ఇక లేడంటే నమ్మలేకపోయాడు. అందుకే తండ్రి శవాన్ని చూసి తట్టుకోలేకపోయాడు. జీవం కోల్పోయిన తండ్రి మీద పొర్లాడు. పిచ్చివాడిలా ఇల్లంతా దొర్లాడు. జుత్తు పీక్కున్నాడు. తల బాదుకున్నాడు.

తండ్రికి తలకొరివి పెడ్తున్నప్పుడు గుండె క్రిందకు జారిపోయినట్లయ్యింది. తర్వాత కూడా రాత్రనక, పగలనక గుండెలవిసి పోయేలా ఏడ్చాడు. భార్య ఓదార్చలేకపోయింది. పిల్లలు బిక్కు బిక్కుమని చూస్తూ ఉండిపోయారు.

తల్లి....బ్రతికున్న శవం లాగే అయిపోయింది. ఆమెను చూస్తుంటే రామారావుకి కడుపు చెరువే అయ్యింది.

అలాంటి గాయానికి మందు కాలమే అయినా అది కూడా చాలా ఎక్కువే పట్టింది రామారావు తేరుకోడానికి.

x x x x

బస్టాపులో నిల్చున్న రామారావు దగ్గరకు అతని తండ్రి వయసే ఉన్న ఓ వ్యక్తి వచ్చాడు. రామారావుని చూసి తటపటాయించాడు.

"నా పేరు.....సుందర్రావు బాబూ....మీ నాన్నతోనే పని చేసేవాడిని. మేమిద్దరం చాలా ఇదిగా ఉండేవాళ్ళం,..."

అతనిని అప్పడప్పుడూ చూసిన గుర్తు ఉంది కానీ సరిగ్గా అతనెవరో తెలియని రామారావు అతని ఆ మాటల్లో తండ్రి ప్రస్తావన వచ్చినందుకు, అతను తండ్రి స్నేహితుడు అయినందుకు తన తండ్రే ఎదురుగా వచ్చి మాట్లాడుతున్నంత ఆనంద పడ్డాడు.

"మీ నాన్న ఎప్పుడూ చాలా చలాకీగా ఉండేవాడు బాబూ. చాలా మంచి మనిషి"

తండ్రి గుర్తొచ్చి గుండె బరువెక్కిపోయింది రామారావుకి.

"బాబూ....చిన్నమాట"

"చెప్పండి...."

"మీ నాన్న నా దగ్గర కొంత అప్పతీసుకున్నాడు"

"ఎంతండి...?"

"ఎంతో కాదులే. అయిదొందలు...."

రామారావు చేయి జేబులోకి వెళ్ళింది. కిరాణా కొట్టు అతనికి జమ చేయాల్సిన మొత్తం వుంది జేబులో. ఆ డబ్బుని బయటకు తీసి అతనికి అయిదొందలు ఇచ్చేసాడు.

"తండ్రి ఋణాన్ని తీర్చే కొడుకులకి అంతా మంచే జరుగుతుంది బాబూ ఎప్పుడూ...." రామారావు ఇచ్చిన మొత్తాన్ని జేబులో పెట్టుకొని అన్నాడతను.

x x x x

"మీ నాన్న అప్పు తీసుకున్నా అన్న సమయానికి ఇచ్చేసే మంచివాడు నాయనా. తీసుకున్నది రెండు వేలు. అబద్ధం ఎందుకూ, పన్నెండు వందలు తీర్చేసాడు. ఇంకా ఎనిమిది వందలు తీర్చాలి, వడ్డీ కాక...."

రామారావు అతని వైపు చూసాడు.

"మనిషే పోయింతర్వాత వడ్డీదేముందిలే బాబూ"

రామారావు చేయి ప్యాంటు జేబులోకి వెళ్ళింది. రామారావు ఇచ్చిన డబ్బుని అందుకున్నాడతను.

"మీ నాన్న పోయినట్టు నాకు ఆ మర్నాడు తెలిసింది నాయనా. వెంటనే వచ్చాను, కానీ దుఃఖ సాగరంలో ఉన్న మీతో మాట్లాడ్డానికి నాకు నోటమాట రాలేదు బాబూ....మరి నే వస్తామా"

x x x x

"యాభై, వందా అయితే అడిగి వుండేవాడిని కాదు. పదకొండు వందలు. అందుకే అడుగుతున్నాను"

రామారావు చేయి జేబులోకి వెళ్ళింది.

"ఇదుంచండి. మిగతాది సగం సగం చొప్పున రెండు నెలల్లో ఇచ్చేస్తాను"

"నీకు ఎలా అవకాశం ఉంటే అలా చేయి బాబూ. మీ నాన్న పెంపకం నాకు తెలుసు కాబట్టి, నీకు తండ్రిని ఋణ విముక్తుణ్ణి చేసే మనసుంటుందని ఊహించాను బాబూ....నా ఊహ అబద్ధం కాలేదు. వస్తాను బాబూ పై నెల్లో"

x x x x

"పోయేటప్పుడు ఏదీ పట్టుకు పోలేం నాయనా. అయినా జీవించి ఉన్నంత వరకూ ఈ లావాదేవీలు తప్పవు మనిషికి. అడిగేనని ఏమైనా అనుకుంటున్నావా.".."

"బాబూ?"

"అబ్బే, అదేం లేదండీ...."

"ఒక్కసారే అంటే నువ్వు మాత్రం ఎలా ఇవ్వగలవు? నీకు వీలున్నప్పుడు వీలైనంత ఇచ్చినా పర్వాలేదు. ఆఖరు నెల వడ్డీ మినహాయింపు చేస్తాన్లే నాయనా...."

"అలాగే నండి. చీటీ ఒకటుంది. అది పై నెల పాడి ఇచ్చేస్తాను"

"మీ నాన్న కూడా నీలాగేనయ్యా. అందరితోనూ మర్యాదగా వుండి అందరి దగ్గర మన్నన పొందేవాడు. నీదీ మీ నాన్న పోలికే. వస్తానయ్యా"

x x x x

"మీ నాన్న తీర్చిన వివరాలు నోటు వెనకాల వున్నాయి. మిగతాది ఇచ్చేస్తే నోటు నీకిచ్చేస్తాను బాబూ...."

"ఇప్పటికే చాలా అప్పులు తీర్చానండి. మీ అప్పు కూడా తీర్చేస్తాను, కాస్త టైమివ్వండి...."

"దాందేముంది నాయనా. నీక్కావల్సినంత టైము తీసుకో. వడ్డీ మాత్రం, జీతాలనాడు ఖచ్చితంగా కట్టేస్తుండు"

"అలాగేనండీ..."

x x x x

"మీ నాన్న మీదున్న నమ్మకంతో నోటు లేకుండా నోటిమాట మీద ఇచ్చాను...."

"మీ బాకీ అణా పైసల్తో తీర్చేస్తానండి. కానీ నేను కూడా చాలా ఇబ్బందుల్లో వున్నాను. నాకు వీలు చిక్కినప్పుడు నేనే మీ ఇంటికి పట్టుకొచ్చి ఇచ్చేస్తానండి."

"అలాగే బాబూ....నీ దగ్గరున్నప్పుడే ఇయ్యి. మరి నే వస్తామా?"

"...మంచిదండి"

x x x x

"ఎంతివ్వాలి....?"

"రెండు వేలు బాబూ..."

"ఎప్పుడిచ్చారు...."

"రెండేళ్ళవుతుంది బాబూ...."

"వడ్డీకా?"

"అవును....

నూటికి మూడు రూపాయలు...."

"మా నాన్నగారు మీకు డబ్బు ఇచ్చెయ్యలేదా?"

"బ్రతికుంటే ఇచ్చేసేవాడు బాబూ. చాలా మంచి మనిషి. ఎప్పుడు అప్పిచ్చినా అతని దగ్గర నోటు రాయించుకొనే అలవాటు లేదు నాకు...."

రామారావు కుడి చేయి ప్యాంటు కుడి జేబులోకి వెళ్ళింది.

"సుందర్రావు, వెంకట్రావు వాళ్ళు చెప్పారు బాబూ నువ్వు అడగ్గానే ఇచ్చేసావని. నాది కూడా ఇచ్చేస్తే నీ తండ్రి ఆత్మకు శాంతి కలుగుతుంది బాబూ...."

తండ్రి....ఆత్మ......శాంతి.....అప్పులు.. ఆందోళన....కష్టాలు.....

భరించలేని అశాంతి....మోయలేని అప్పుల భారం....మారిపోతున్న ఆర్థిక పరిస్థితి.....చితికి పోతున్న మనసు..... కుమిలిపోతున్న హృదయం....మసక బారిపోతున్న తండ్రి రూపం.....

రామారావు ఎడమ చేయి కూడా ప్యాంటు జేబులోకి వెళ్ళింది.

"మీరు అప్పు ఎవరికిచ్చారు?"

"మీ నాన్నకి..."

"ఇప్పుడు ఎవర్ని అడుగుతున్నారు....?"

"నిన్ను....బాబూ...."

"నేనా మీ దగ్గర అప్పు చేసింది?"

"కా....దు...."

"మరి....నేనా తీర్చవలసింది?"

"నాకే సంబంధమూ లేదు. నేనా అప్పు తీర్చను. అసలు మా నాన్నగారు మీ దగ్గర అప్పు తీసుకున్నారో లేదో నాకేం తెలుసు? తీసుకున్నారనే అనుకున్నా నాకు చెప్పి ఇచ్చారా అప్పుడు?"

"...! ......! .....!"


ఏమన్నాడో, ఎలా అన్నాడో....గబగబా అనేశాడు. ఆ మాటలు బయటకు రావడానికి రామారావు గొంతు చిట్లిపోయింది. నరాలన్నీ తెగిపోయాయి!

తండ్రి ఆత్మ శాంతించిందో లేదో గానీ....రామారావుకి మాత్రం ఆర్థికంగా శాంతి లభించింది!

●

తెలుగు కళాసమితి మ్యాజర్వీ-రాజాలక్ష్మీ ఫౌండేషన్‌వారికి కార్టూన్ల పోటీలో...

బహుమతి పొందిన కార్టూన్







## బహుమతి

ఫిన్‌లాండ్ దేశంలో వివాహాలకు హాజరయ్యేవారు బహుమతులు ఇవ్వకుండా తిరిగి రావడం సాధ్యపడదు. వచ్చేవారి మెడను కౌగిలించుకొని పెళ్ళికూతురు ఏడ్వడం మొదలుపెడుతుంది. వారి బహుమతి అందేవరకూ ఈ విధంగానే సాగుతుంది. ఆ తరవాతే ఏడుపు ఆగుతుంది. మనదేశంలో కూడా పెళ్ళికూతుళ్ళు ఇలా మొదలెడితే ...?

– ఆర్. విజయలక్ష్మి,
దేవునికడప